క్లుప్తంగా

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని పుష్పమాలికలు, తులసిమాలలతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు నిర్వహించారు.

మతిస్థిమితం లేని యువతికి ఆశ్రయం



మానసిక వికలాంగురాలితో మాట్లాడుతున్న జ్యోతిర్మయి

అల్లిపురం: రోడ్డుపై మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న యువతికి ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం సిబ్బంది ఆశ్రయం కల్పించారు. ఆరిలోవ శివారు ప్రాంతం, టీబీసీ పాయింట్ సమీపంలో ఒక యువతి మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న విషయాన్ని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి సమాచారం అందింది. దాంతో ఆమె అక్కడికి వెళ్లి యువతిని వెతికి పట్టుకుని టీఎస్ఆర్ మహిళా వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. అనంతరం ఆమెను చినవాల్తేరులో గల మానసిక వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు.

ఘనంగా శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడి వర్ధంతి



శంకరరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కృష్ణకుమార్

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు 11వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని శంకరరావు విగ్రహానికి శంకర్‌ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగులు, వైద్యులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మిన్ అండ్ ఆపరేషన్స్ జీఎం కె.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా ఏకాదశి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శనివారం సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో అధిష్టంపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

త్వరితగతిన నగర సుందరీకరణ పనులు

– జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం



రైల్వే స్టేషన్ రోడ్డులో సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం షీలానగర్, ఎయిర్‌పోర్ట్, ఎన్ఏడీ జంక్షన్, మర్రిపాలెం, మురళీనగర్, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీ20 సదస్సుకు ఎంతో మంది దేశ విదేశీ ప్రతినిధులు వస్తున్నందున, వారికి ఆహ్లాదం కలిగించేలా నగర సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన మార్గంలోని బారికేడ్ల వద్ద వినియోగంలో లేని కేబుల్ వైర్లు తొలగించాలని, అవసరమైన వైర్లను క్రమబద్ధీకరించాలని, అనుమతి లేని ప్రకటన బోర్డులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైలింగ్‌కు పెయింటింగ్ రెండో సారి వేయాలని, సెంట్రల్ మీడియంలో మొక్కలు, వాటి మధ్య ఖాళీలు అక్కడక్కడ ఉన్నాయని, ఆ ప్రాంతంలో కొత్తవి నాటాలన్నారు. పాత సూచిక బోర్డులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, బస్ షెల్టర్లను ఆధునికీకరించాలని, మొక్కలను ట్రిమ్ చేస్తూ, ప్రధాన రహదారి పొడుగునా ఉన్న ప్రతి మొక్కకు రోజూ నీరు పోయాలన్నారు. మర్రిపాలెంలోని 24/7 తాగునీటి ప్రాజెక్టును పరిశీలించేందుకు అతిథులు ఆ ప్రాంతాన్నిసందర్శిస్తారని, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నిత్యం మనం ప్రజలకు తాగునీరు ఏ విధంగా అందిస్తున్నామో తెలియజేయాలన్నారు. మాధవధార రిజర్వాయర్, దాని చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అందంగా మార్చాలని ఆదేశించారు. పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, హార్టికల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, సింహాచలం, మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ కె.వేణుగోపాలరావు, డీసీపీ సంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సహజ ప్రసవాలను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : సిజేరియన్ ప్రసవాలు సాధ్యమైనంత తక్కువగా చేయాలని, సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం జగదాంబ దరి జీవీఎంసీ సమావేశ మందిరంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా, ఇతర వ్యాధుల నివేదికలు ప్రతి నెలా క్రమం తప్పకుండా పంపాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ జీవన్‌రాణి మాట్లాడుతూ ప్రతి నెలా వ్యాధి నిరోధక టీకాలు అర్హులైన పిల్లలు, గర్భిణులకు వేయాలన్నారు. ఆ నివేదికలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి, డీఐవో కార్యాలయానికి పంపాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి మణి మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, ఇతర సీజనల్ వ్యాధుల నివేదికలు పంపాలన్నారు. అలాగే టీబీ, ఎయిడ్స్ వ్యాధుల నివేదికలు కూడా అందజేయాలన్నారు. డాక్టర్ యామిని ఐఆర్ఏడీ యాప్ గురించి తెలిపారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.40 లక్షల ఆస్తిపన్ను వసూలు



సెక్రటరీ అడ్మిన్ల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలో రూ.40 లక్షల ఆస్తి పన్ను వసూలు అయిందని జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన జోనల్ కార్యాలయంలో సెక్రటరీ అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్నుపై వడ్డీమాఫీ ప్రకటించడంతో శనివారం ఒక్కరోజే రూ.40 లక్షలు వసూలు అయిందన్నారు. ఈ మాఫీ సమాచారం ప్రజల్లోకి తీసుకెళ్లి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని జెడ్సీ తెలిపారు. ఈ నెలాఖారు నాటికి జోన్ పరిధిలోని 12 వార్డుల్లోను రూ.10 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. సెక్రటరీలు, అడ్మిన్లు మొండి బకాయిదారుల నుంచి కూడా వసూలు చేయాలన్నారు. ఆస్తి పన్ను కట్టని పక్షంలో జప్తు నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికీ స్పందించని వారి ఆస్తి జప్తునకు చర్యలు తీసుకోవాలన్నారు. చెక్కులు తీసుకోవద్దని.. డీడీ రూపంలోనే ఆస్తిపన్ను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీలు, అడ్మిన్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

డాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా నగర కాంగ్రెస్ పార్టీలో శనివారం సమావేశం సాగింది. పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు విశాఖలో గల 6 నియోజకవర్గాల నాయకులతో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పి. రాకేష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పరిరక్షించే బాధ్యత తీసుకుంటుందన్నారు. గ్యాస్ సిలిండర్‌ని రూ.500కే అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ అంశాలను ప్రతి కార్యకర్త ప్రజలకు వివరించాలన్నారు.

మహిళా కళాశాలలో ‘నేక్’ బృందం పర్యటన



నేక్ బృందంతో ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నేక్ పీర్‌టీం పర్యటించింది. ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాల మదింపునకు ఈ కమిటీ గ్రేడింగ్ ఇస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి తెలిపారు. కరిక్యులమ్, డిజైనింగ్, బోధనా ప్రమాణాలు, పరిశోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల పురోభివృద్ధి, గవర్నెన్స్, లీడర్‌షిప్, బెస్ట్ ప్రాక్టీసెస్ అనే అంశాలపై అంచనా వేసేందుకు ఈ కమిటీ పరీక్షిస్తుందని తెలిపారు. కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ కరుణేష్ సక్సేనా, ప్రొఫెసర్ పమేలా సింగ్లా, ప్రీతి జోహరి సభ్యులుగా వచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఏజీవో డాక్టర్ కె. సుధ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే సమాజ ప్రగతి



మేయర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ప్రజాసేవతోనే సమాజ ప్రగతి సాధ్యమని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అభిప్రాయపడ్డారు. విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఉగాది సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మేయర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి రామ్మోహన్, సతీష్, సూర్యనారాయణ, సత్య, మహాలక్ష్మి, సన్నీ, అనిల్, శివ, శ్రీకాంత్, సనరా వంశీ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనం అవసరం



ఎన్‌వీపీ న్యాయ కళాశాల విద్యార్థులతో శ్రీనివాసరావు తదితరులు

విశాఖ, లీగల్ : న్యాయ విద్యార్థులకు నిరంతర అధ్యయనం అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం నగరంలోని వివిధ న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో న్యాయమూర్తి వివిధ అంశాలపై ముచ్చటించారు. న్యాయవాదులు ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలతో పాటు కోర్టులో కేసుల విచారణ, సీనియర్ న్యాయవాదుల వాదనలు విని ఆకళింపు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలల్లో నేర్చుకున్న అంశాలను, న్యాయస్థానాల్లో తీర్పులు, సీనియర్ల వాదనలు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను అన్వయించే విధానాలను గ్రహించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు, ఉచిత న్యాయ సహాయం, సంబంధిత చట్టాలను వివరించారు.

కూరగాయల మార్కెట్ సందర్శన



వ్యాపారులతో మాట్లాడుతున్న కేరళ బృందం

జగదాంబ: రామకృష్ణ రైతుబజార్‌ను శనివారం కేరళ మెప్మా ఎండీ జాఫర్ మాలిక్ బృందం సందర్శించింది. మార్కెట్ల అధ్యయనం, ఫుడ్‌కోర్టుల నిర్వహణ, మహిళలకు అమలవుతున్న అభివృద్ధి పథకాలను పరిశీలించేందుకు వచ్చిన బృందానికి వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి వ్యాపారులతో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆ బృందం వ్యాపార లావాదేవీలపై ఆరా తీసింది. మార్కెట్‌కు రైతుల ద్వారా వస్తున్న కూరగాయలు, వాటి కొనుగోలు అంశాలను బృందం తెలుసుకుంది. రైతులు పండిస్తున్న కూరగాయలకు గిట్టుబాటు ధర లభిస్తుందా.. లేదా అనే విషయాన్ని బృందం సభ్యులు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆర్గానిక్ పంటల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీపీ శ్రీనివాసరావు, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వర స్వామికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలోని కోదండ సీతారామ, ధన లక్ష్మీ దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి చరణాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన మొదలగు పూజలు జరిపారు. ఆలయం రద్దీగా ఉండటంతో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు తొలి పూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందిచారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తి సంకీర్తన నిర్వహించారు.

కలియుగ వెంకన్న ఆలయంలో..

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథ శర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వెంకన్న, పద్మావతి, అలమేలు మంగమ్మలకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన మొదలగు పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సమాజానికి దిక్సూచి పాత్రికేయులు

డాబాగార్డెన్స్: సమాజానికి దిక్సూచిగా ఉన్న పాత్రికేయుల సంక్షేమానికి తమ సంస్థ అండగా నిలుస్తుందని వర్ధమాన సినీ నటుడు కంచర్ల ఉపేంద్ర పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శోభకృత్ నామ ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని అవసరమైన వారికి తమ సంస్థ సహకారమందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయలను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బంగారు అశోక్‌కుమార్, గౌరవ సలహాదారు ఎస్. నాగేశ్వరరావు, సీనియర్ పాత్రికేయుడు పీఏఆర్ పాత్రుడు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ అప్పారావు పాల్గొన్నారు.

అనగనగా కథలో.. పోస్టర్ ఆవిష్కరణ..

ఇదే వేదికపై ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ రూపొందిస్తున్న, వర్ధమాన హీరో ఉపేంద్ర నటించిన అనగనగా కథలో చిత్రం పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. కంచర్ల ఉపేంద్ర, సుబ్బలక్ష్మి, సునీత నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి ఎస్‌వీ పసలపూడి దర్శకత్వం వ్యవహరించారు.

సేవారంగ పరిశ్రమలకు 30 శాతం సబ్సిడీ



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏడీ డాక్టర్ పద్మ. చిత్రంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.పద్మ అన్నారు. చిన్న తరహా పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆమె సూచించారు. పెందుర్తిలోని మహిళా ప్రాంగణంలో శనివారం ఖాదీ బోర్డు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీ పద్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. సేవారంగ పరిశ్రమలకు 30 శాతం వరకు సబ్సిడీ ఉంటుందని, బ్యాంకులు కూడా రుణాలు మంజూరు చేయడానికి ముందంజలో ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఏపీడీ రమేష్, సుశీల్,ఆనందరావు,పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

న్యూ పెన్షన్ స్కీంతో రైల్వే కార్మికులకు నష్టం



ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొత్త పింఛన్ పథకం (న్యూ పెన్షన్ స్కీం)ను రద్దు చేయాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్, ఇంజినీరింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం హంప్ యార్డ్ వద్ద గేట్ మీటింగ్ ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ జోనల్ సెక్రటరీ బి.దామోదరరావు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కొత్తగా విధుల్లో చేరిన వారంతా ఈ పథకం కిందకు వస్తారని, దీనిని వ్యతిరేకించేందుకు రూపొందించిన కార్యక్రమాల్లో రైల్వే కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నూతన డివిజనల్ కో ఆర్డినేటర్ పి.వి.జె.రాజు మాట్లాడుతూ మొదటి నుంచి ఎన్‌పీఎస్‌కు వ్యతిరేకంగా శ్రామిక్ యూనియన్ పోరాడుతోందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 21న రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా పి.వి.జె.రాజును కేంద్ర కార్యవర్గ సభ్యులు, బ్రాంచి సెక్రటరీ బి.సోమేశ్వరరావు పరిచయం చేసి, ఇంజినీరింగ్ బ్రాంచ్ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ సూర్యప్రకాష్, ఇతర సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఆలయ సిబ్బంది



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.అలాగే పండితులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ



పెందుర్తి భవిత కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరం

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తగిన శ్రద్ధ తీసుకుంటున్నట్లు సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ అబ్దుల్ ఆషా తెలిపారు. జిల్లాలోని అన్ని భవిత కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. వైకల్యం గల పిల్లలకు ఫిజియోథెరపి సేవలను సైతం అందిస్తున్నామన్నారు. పెందుర్తి భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో చదువుతో ఆరోగ్య పరమైన సేవలు అందిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి



జస్టిస్ శేషసాయికి స్వాగతం పలుకుతున్న పి.నరసింగరావు

విశాఖ లీగల్: న్యాయసేవ ప్రాధికార సంస్థ, ఉచిత న్యాయసేవలు, చట్టాలపై న్యాయవాదులు, ప్రజలకు అవగాహన అవసరమని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, లోక్ అదాలత్ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ ఆకుల శేషసాయి అన్నారు. శనివారం ఆయన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నరసింగరావు, మెట్రోపాలిటిన్ సెషన్ జడ్జి ఎం.రమణారావు, లోక్ అదాలత్ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు న్యాయమూర్తితో పలు అంశాలపై చర్చించారు. గత ఏడేళ్లలో ఆరు వేల మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వచ్చే రోజుల్లో మరిన్ని శిక్షణ తరగతులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని న్యాయమూర్తి సూచించారు.